సమస్యలతో సతమతం

- నగర పంచాయతీలో కుంటుపడిన అభివృద్ధి.. సంక్షేమం
- తాజాగా ప్రకటించిన ర్యాంకుల్లో దాచేపల్లికి 90వ ర్యాంక్



దాచేపల్లిలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన పంట కాలువ

దాచేపల్లి : అభివృద్ధి.. సంక్షేమంలో అధోపాతాళానికి వెళ్లింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నింటా ముందున్న దాచేపల్లి నగర పంచాయతీ నేడు అన్నింటా వెనుకబడింది. కూటమి ప్రభుత్వం తాజాగా మున్సిపాలిటీలకు ప్రకటించిన ర్యాంకుల్లో దాచేపల్లి నగర పంచాయతీ 90వ స్థానాన్ని దక్కించుకోగా పిడుగురాళ్ల మున్సిపాలిటీ 110వ స్థానాన్ని దక్కించుకుంది. సంక్షేమం.. అభివృద్ధి.. మౌలిక వసతులు తదితర అంశాల్లో ఈ రెండు కూడా వెనుకబడి ఉన్నాయనే విషయాన్ని కూటమి ప్రభుత్వం చేసిన సర్వే స్పష్టం చేసింది. దీంతో నగర పంచాయతీ, మున్సిపాలిటీలో అభివృద్ధి సంక్షేమం అడుగంటిందనే చెప్పుకోవాలి.

పట్టించుకునే వారేరి

దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం ఉరుకులు పరుగులు తీయాల్సిన పరిస్థితి. నారాయణపురం నడికుడి రోడ్డు విస్తరణ పనుల పేరుతో 6 నెలల క్రితం తాగునీటి పైపులను తొలగించారు. దీంతో నారాయణపురంలోని 15వ వార్డు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు పనులు ఎప్పుడు పూర్తవుతాయో కూడా చెప్పలేని స్థితిలో నగర పంచాయతీ, ఆర్ అండ్ బీ అధికారులు ఉన్నారు.



లైబ్రరీ సెంటర్‌లో లీకేజీ ఉన్న పైపులైన్‌కి రబ్బరు చుట్టిన దృశ్యం



తాగునీటి కోసం ఖాళీ బిందెలతో హైవేపై ఆందోళన చేస్తున్న దుర్గాభవానీ కాలనీవాసులు(ఫైల్)

■ అంతేకాకుండా దుర్గాభవాని కాలనీలో మంచి నీళ్లు దొరక్క ప్రజలు రోడ్డు ఎక్కి ఆందోళన చేశారు. దీంతో అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులుపుకున్నారు. ఈ కాలనీలో ఒక సిమెంట్ రోడ్డు లేక ఇబ్బందులు, అలాగే రాత్రి సమయాల్లో విషసర్పాలతో భయాందోళన చెందుతున్నారు.

■ ఇదిలా ఉండగా నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపటం లేదు.

■ నగర పంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు నాటి ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం ద్వారా జలజీవన మిషన్ పథకం కింద రూ.16.50 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ పనులు నేటికీ పూర్తి కాకపోవడంతో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పలుచోట్ల మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి.

అడుగడుగునా ఆటంకాలే

నగర పంచాయతీ చైర్ పర్సన్‌గా ఉన్న కొప్పుల సుబ్బమ్మ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పాటుపడుతుండగా కూటమి నాయకులు అడుగడుగునా ఆటంకాలు కలుగజేస్తున్నారు. సుబ్బమ్మ చైర్ పర్సన్‌గా ఉన్నప్పటికీ పెత్తనమంతా కూటమి నేతలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. ఏడాదిన్నరగా నగర పంచాయతీలో ఎటువంటి అభివృద్ధి లేకపోవటం వల్లే రాష్ట్ర స్థాయిలో 90వ ర్యాంకు వచ్చిందని ప్రజలు చెప్పుకుంటున్నారు.

6 నెలలుగా మంచినీళ్లు లేవు



15వ వార్డులో రోడ్డు విస్తరణ పేరుతో గత ఆరు నెలల క్రితం రోడ్డు తవ్వి పైపులైన్లను తొలగించారు. నెల రోజుల్లోనే పైపులు వేసి యథావిధిగా తాగునీరు అందిస్తామని అధికారులు చెప్పారు. కానీ పైపులను తొలగించి ఆరు నెలలు దాటిపోయింది. నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నాం. రెండు రోజులకు ఒక్కసారి ట్యాంకర్ల ద్వారా అందించే నీరు సరిపోవటం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ రోడ్డు పనులు సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు.

– షేక్ జాకీర్ హుస్సేన్, 15వ వార్డు నివాసి

అభివృద్ధి చేయాలి



రాష్ట్రంలో ఉన్న నగర పంచాయతీలు, మున్సిపాలిటీల్లో దాచేపల్లి 90వ ర్యాంకు సాధించి చరిత్రలో నిలిచింది. అభివృద్ధి, సంక్షేమం చేస్తే మొదటి స్థానాల్లో ఉండేది. నగర పంచాయతీ ప్రజలకు ఇంటి వద్దకే కుళాయి ద్వారా నీళ్లు అందించేందుకు అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి జలజీవన్ మిషన్ ద్వారా రూ.16.50 కోట్లు నిధులు మంజూరు చేయిస్తే ఆ పనులు ఇంత వరకు జరగలేదు. నగర పంచాయతీని అభివృద్ధి చేసి మంచి పేరు తీసుకురావాల్సిన బాధ్యత ప్రస్తుతం కూటమి నేతలపై ఉంది.

– మునగా శ్రీనివాసరావు, దాచేపల్లి

క్లుప్తంగా

లిఫ్టులో ఇరుక్కున్న ప్రయాణికులు



దాచేపల్లి: నడికుడి రైల్వేస్టేషన్‌లో లిఫ్టులో ప్రయాణికులు ఇరుక్కుపోయారు. సికింద్రబాద్ నుంచి నడికుడికి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో వచ్చింది. ఈ రైలులో నుంచి కొంత మంది ప్రయాణికులు దిగారు. 2వ నెంబర్ ప్లాట్‌ఫాం నుంచి 1వ నెంబర్ ప్లాట్‌ఫాం మీదకు వచ్చేందుకు ప్రయాణికులు లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ కింద నుంచి పైకి వెళుతున్న క్రమంలో సాంకేతిక సమస్యతో మధ్యలోనే ఆగిపోయింది. దీంతో అందులో ఉన్న ప్రయాణికులు భయాందోళన చెందారు. రైల్వే సిబ్బంది 10 నిమిషాల పాటు శ్రమించి అతికష్టం మీద లిఫ్ట్ తలుపులు తెరవడంతో ప్రయాణికులు క్షేమంగా బయటకు వచ్చారు. ఇటీవల కాలంలో నడికుడి రైల్వేస్టేషన్‌లోని లిఫ్టు తరచూ ఆగిపోతుంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

మొక్కజొన్నల కోసం గొడవ

పిడుగురాళ్ల: మొక్కజొన్నల కోసం గొడవ జరిగిన ఘటన మండలంలోని తుమ్మలచెరువులోని అంజనీపురం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తుమ్మలచెరువు గ్రామంలోని అంజనీపురం చెట్టు వద్ద గల వైన్ షాపులో మద్యం తాగుతూ పక్కనే ఉన్న మొక్కజొన్న తోటలో మొక్కజొన్న కంకులను కోసేందుకు శ్రీనివాసరావు వెళ్లాడు. అదే పొలంలో పని చేస్తున్న పొలం యజమాని కవులూరి అమీర్, శ్రీనివాసరావులు మొక్కజొన్న కంకులను కొయ్యటం ఏమిటని ఇరువురి మధ్య గొడవ జరిగి తోపులాటకు దారి తీసింది. ఈ క్రమంలో శ్రీనివాసరావు తీసుకొచ్చిన కత్తితో అతని చేతికే గాయమైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ మోహన్ తెలిపారు.

గోకుల షెడ్‌ల నిర్మాణానికి భూమి పూజ



కారెంపూడి: మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం కారెంపూడిలో గోకుల షెడ్‌ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గోకుల షెడ్‌లు మంజూరైన రైతులు ఎమ్మెల్యే చేతుల మీదగా భూమి పూజ చేయించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ బాణావతు సరస్వతీభాయి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, టీడీపీ నాయకులు పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, కర్నా సైదారావు ఏపీఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సో పిట్స్ ఏర్పాటు అవశ్యం

సైడ్ డ్రైన్స్ లేని చోట ఇంట్లో వాడుకున్న నీరు భూమిలో ఇంకిపోయే విధంగా కారెంపూడిలో ఏర్పాటు చేస్తున్న సో పిట్స్‌ను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం పరిశీలించారు. దీనివల్ల సైడు కాల్వలు లేని చోట ఇంట్లో వాడుకున్న నీరు భూమిలోకి ఇంకిపోయి భూగర్భ జలాలు వృద్ధి అవుతాయని వీటి ఏర్పాటు అవసరమైన చోట చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్ష బీభత్సం.. రాకపోకలకు అంతరాయం!



యడ్లపాడు: మధ్యాహ్నం వరకు వేసవిని తలపించేలా మండుటెండతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఊరటనిచ్చింది. కారుమబ్బులు దట్టంగా అలుముకుని, ఉరుములు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఈదురు గాలుల తీవ్రతకు బోయపాలెం నుంచి చెంఘీజ్‌ఖాన్‌పేట వెళ్లే మార్గంలో పలుచోట్ల భారీ చెట్లు నేలకూలాయి. ముఖ్యంగా గురుకుల పాఠశాల మార్గం నుంచి సంగం గోపాలపురం వరకు ఆర్ అండ్ బీ రహదారిపై పెద్ద పెద్ద చెట్లు అడ్డంగా పడటంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో విద్యుత్ లేకపోవడం, చెట్లు, కొమ్మలు రోడ్డుపై అడ్డంగా పడి ఉండటంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు రోడ్డుపై ఉన్న వాటిని అడ్డుతొలగించినట్లు సమాచారం.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిలిపివేయాలి

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుల డిమాండ్

కారెంపూడి: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిలిపివేయాలని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శామ్యూల్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు మేలు జరగాలని ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆనాడు రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. వాటిలో కొన్ని ఇప్పటికే ప్రారంభమయ్యాయని మిగతా వాటిని కూడా ప్రారంభించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. అయితే మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించి వైద్య విద్యను వాణిజ్యపరం చేయాలని చూసే చర్యలను వారు ఖండించారు. దేశ చరిత్రలోనే ఎక్కువ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయాలని మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంకల్పించి వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేయాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు.

ఇర్లపాడులో వైద్య శిబిరం



శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో జన విజ్ఞాన వేదిక సారథ్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా జన విజ్ఞాన వేదిక కార్యదర్శి మార్కాపురం వైద్య కళాశాల అధ్యాపకుడు సంద్రపాటి చలపతిరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీపీ, షుగర్, కంటి జబ్బులు తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. శిబిరంలో 85 మందికి వైద్య పరీక్షలు ఉచితంగా మందులు అందజేశామన్నారు.

ఐక్య పోరాటంతోనే సమస్యల పరిష్కారం

ఆశావర్కర్స్ జిల్లా కమిటీ సమావేశంలో డి.శివకుమారి, ఎం.రత్నకుమారి



సమావేశంలో శివకుమారి, మహిళా నాయకులు

నరసరావుపేట: ఐక్య పోరాటాలు చేయడం ద్వారానే అనేక సమస్యలు పరిష్కరించుకోవడం జరిగిందని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షురాలు డి.శివకుమారి పేర్కొన్నారు. కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జిల్లా అధ్యక్షురాలు కె.చంద్రకళ అధ్యక్షతన పల్నాడు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. శివకుమారి మాట్లాడుతూ ఆశాల పోరాటాల ఫలితంగా రూ.1.50 లక్షలు రిటైర్‌మెంట్ బెనిఫిట్, ఉద్యోగ విరమణ వయోపరిమితి 62 ఏళ్లు, 180 రోజులు ప్రసూతి సెలవులు సాధించుకున్నామన్నారు. నెలకొన్న అనేక సమస్యలు పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేయాల్సి ఉందన్నారు. గర్భిణులను గ్రామీణ ప్రాంతాల నుంచి పీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రికి తీసుకువస్తున్న ఆశా వర్కర్లకు ప్రభుత్వం టీఏ, డీఏలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆరున్నర ఏళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పెంచిన వేతనాలే ఇప్పటికీ అమలవుతున్నాయన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రత్నకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు విశేష సేవలు అందిస్తున్న ఆశాలకు కనీస వేతనాలు, వారాంతపు సెలవులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సెలవులు వర్తింపజేయాలని, మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల నియామకాలలో రాజకీయ జోక్యం ఉండకూడదని, ఏఎన్ఎం పోస్టుల భర్తీలో ఆశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల చివరి వారంలో కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. భవిష్యత్తులో యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కోశాధికారి ఎం.ధనలక్ష్మి, కమిటీ సభ్యులు ఎం.చిన్నమ్మాయి, షేక్ మెహరున్నీసా, పి.బుజ్జి, డి.రత్నకుమారి, కె.జోసెఫ్‌రాణి, ఎన్.విక్టోరియా పాల్గొన్నారు.


కూలీలు కేవైసీ తప్పక చేయించుకోవాలి

డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి



కారెంపూడి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్క ఉపాధి కూలీ ఆధార్ కేవైసీ తప్పక చేయించుకోవాలని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి కోరారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం పీడీ పర్యటించారు. కొందరు కూలీలకు పీడీ స్వయంగా కేవైసీ చేశారు. ఉపాధి పనులకు వచ్చిన వారికి ఇక రానున్న రోజుల్లో హాజరు కేవైసీ ద్వారా మాత్రమే వేయాల్సి ఉంటుందన్నారు. అందరూ కూడా తప్పనిసరిగా తమ గ్రామాలలోని ఫీల్డ్ అసిస్టెంట్స్‌ను కలసి కేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ సత్యనారాయణ, ఏపీవో కె.నాగేశ్వరరావు, టీఏ అంజిరెడ్డి, ఎఫ్ఏ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ పోటీలు



వినుకొండ: మండల స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు, మండల జట్ల ఎంపికలు ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో జఫ్రుల్లా తెలిపారు. పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీలోని జెడ్పీహెచ్ పాఠశాల క్రీడా మైదానాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెలాఖరులో జరిగే డివిజనల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీరప్పయ్య, పీడీలు జి.వీరాంజనేయులు, ఆర్.రాధాకృష్ణమూర్తి, పీఈటీలు వెంకటేశ్వర్లు, జోనానాయక్, కొండలు, వెంకటేష్, అశోక్, ఎంఆర్‌సీ కంప్యూటర్ ఆపరేటర్ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుకున్నారు.. వదిలేశారు

- అధికార పార్టీకి కొమ్ము కాసిన పోలీసులు
- దీపావళి మందలను స్వాధీనం చేసుకోకుండా వదివేసిన వైనం

పిడుగురాళ్ల: దీపావళి మందులు ప్రభుత్వ అధికారుల అనుమతుల మేరకే నిల్వ ఉంచాల్సి ఉండగా కొంత మంది అధికార పార్టీ నాయకుల అండతో నిల్వ ఉంచిన దీపావళి మందుల వివరాలను పిడుగురాళ్ల పట్టణ పోలీసులకు విశ్వసనీయ సమాచారాన్ని కొంత మంది వ్యక్తులు అందించారు. కొంత మంది పోలీసులు హడావుడిగా పట్టణంలోని జానపాడు రోడ్డులోని పాత ఎస్‌బీఐ బజారులో ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించటంతో ఓ టీడీపీ నాయకుడికి చెందిన బంధువు ఇంటిలో దీపావళి మందులు దొరికాయి. అయితే పోలీసులకు తక్షణమే పట్టణానికి చెందిన ఓ ఆర్యవైశ్య టీడీపీ నాయకుడు ఈ దీపావళి మందులు మా బంధువుకు సంబంధించినవేనని హుకుం జారీ చేయటంతో సదరు పట్టణ ఎస్ఐ వాటిని వదిలేసి వెళ్లిపోయారు. అయితే పేలుడు పదార్థాలు నివాసాల మధ్యలో నిల్వ ఉంటే ప్రమాదాలు జరిగితే అధికారులకు తీవ్ర ఒత్తిడి కలుగుతుంది. ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత గల ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకుల సిఫార్సులకు తల వొంచి ప్రమాదకరమైన మందు సామగ్రిని పట్టుకొని కూడా వదిలివేయటం ఎంత వరకు సమంజసమని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

నడికుడి రైల్వే స్టేషన్‌లో భద్రతా సదస్సు



ఆపరేటింగ్ సిబ్బందికి బహుమతులను అందజేస్తున్న డివిజన్ సీనియర్ డీఓఎం జె.శ్రీనాథ్

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నడికుడి రైల్వే స్టేషన్‌లో భద్రతా సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీఓఎం జె.శ్రీనాథ్ మాట్లాడుతూ ఈ సదస్సులో ఆపరేటింగ్ సిబ్బంది భద్రత గురించి అవగాహన కల్పించారు. ప్రధానంగా ఎమర్జెన్సీ రూట్ రద్దు విధానం, ఎమర్జెన్సీ పాయింట్ ఆపరేషన్, పవర్ బ్లాక్, ఫ్లాట్ టైర్, హాటల్ యాక్సిల్ నిర్వహణ, రేక్ కదలిక, కార్యాచరణ పరిమితుల గురించి తెలిపారు. అలాగే సాధారణ, అసాధారణ పని సమయంలో ఎల్‌సీ గేట్, నాన్ ఇంటర్‌లాక్ ఎల్‌సీ గేట్ విధానం గురించి అవగాహన కల్పించారు. వాహనాలను స్థిరపరచడం, భద్రపరచడం వంటి పలు విషయాలపై ఆపరేటింగ్ విభాగాధిపతులకు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న డివిజన్ ఆపరేటింగ్ సిబ్బందితో కలసి భద్రతపై ప్రతిజ్ఞ చేశారు.

జెడ్పీ పాఠశాలలో సమస్యలు పరిష్కరించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి రవిబాబు



జెడ్పీ పాఠశాలలో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బెల్లంకొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నిల్వ ఉన్న వర్షం నీటిని వెంటనే బయటకు పంపడానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు డిమాండ్ చేశారు. కొన్ని నెలలుగా హై స్కూల్ ఆవరణలో వా నీరు నిల్వ ఉండడంతో ఆదివారం సీపీఎం మండల నాయకులు కలిసి పరిశీలించారు. వందల మంది విద్యార్థులు చదువుకుంటున్న హైస్కూల్లో నెలల తరబడి నీరు నిల్వ ఉన్నా పట్టించుకోకపోవడం అన్యాయమని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదులకు వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతూ ఈగలు, దోమలు పెరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ చర్యలు చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చిన్నం పుల్లారావు, నరసింహారెడ్డి, దుగ్గి కోటేశ్వరరావు, రాజారావు పాల్గొన్నారు.

పాలిథిన్ భూతాన్ని తరిమి కొడదాం

అమరావతి సేవా సమితి అధ్యక్షుడు వీరాంజనేయులు



నార సంచులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: చేయి చేయి కలుపుదాం .. పాలిథిన్ భూతాన్ని తరిమి కొడదామని అమరావతి సేవా సమితి అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు పిలుపునిచ్చారు. అమరావతి సేవాసమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు గుండ్లపల్లి కృష్ణ ఆర్థిక సాయంతో పట్టణంలో పండ్ల మార్కెట్, వ్యాపార, వాణిజ్య కూడళ్లలో ఆదివారం పాలిథిన్ వాడకంపై అవగాహన కలగజేసి నార సంచులు పంచారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ నేటి సమాజంలో పాలిథిన్ వాడకం సర్వసాధారణమైందని, దీంతో కలిగే అనర్థాలు కళ్ల ముందు కనిపిస్తున్నా అనేక మంది బాధ్యతారాహిత్యంగా ఉన్నారన్నారు. ఇంటికి వెళ్లేటప్పుడు వస్తువులను సగటు వ్యక్తి పాలిథిన్ సంచుల్లోనే తీసుకెళ్తున్నారని, అవి మానవాళికి పెను సవాల్ విసురుతున్నాయన్నారు. అటు మూగజీవాల ప్రాణాలను సైతం హరిస్తున్నాయన్నారు. పాలిథిన్‌తో కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ చైతన్యం పెంచుకోవాలన్నారు. అప్పుడే వాటి నిషేధం పూర్తిగా జరుగుతుందని చెప్పారు. ఇప్పటి నుంచే పాలిథిన్ సంచులకు ప్రత్యామ్నాయంగా నార సంచులను వినియోగించాలన్నారు. లేకపోతే భవిష్యత్తు తరాలకు పెను ముప్పు తప్పదని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి వ్యక్తి ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు జ్యూట్ సంచిని తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. పాలిథిన్ సంచులు రోడ్లపై వేయడంతో మూగజీవాలకు ప్రాణాంతకంగా మారుతున్నాయన్నారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి పాటిబండ్ల రవి రాజా, సభ్యులు షారోన్ కుమార్, బాలాజీ నాయక్, బబ్బు, తీర్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



బెల్లంకొండలో వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న విద్యుత్ కార్మికులు, జేఏసీ నాయకులు

బెల్లంకొండ: విద్యుత్ శాఖ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నేత కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో స్థానిక ఉద్యోగులు, కార్మికులతో కలిసి సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. తమ సమస్యలను ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించినా స్పందన లేకపోవడంతో సమ్మెకు దిగనున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, వారికి ఇవ్వాల్సిన పీఆర్సీ బకాయిలు, 17 నెలల వేతనం, 10 ఏళ్లు సర్వీస్ పూర్తయిన వారికి ఇస్తున్న సర్వీస్ ఇన్సెంటివ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 13 వరకు పలు దఫాలుగా ధర్నా కార్యక్రమాలు చేయనున్నామన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు పేర్కొన్నారు. కార్మికులు పాల్గొనాలని జేఏసీ నాయకులు కోరారు. కార్యక్రమంలో పరిపూర్ణాచారి, జిలాని, శ్రీనివాస్, గుణశేఖర్, నరసింహారావు, నాగుల్ మీరా, శివారెడ్డి, సుభాని, వెంకట్రావు, ఏడుకొండలు, యలమంద పాల్గొన్నారు.

వైభవంగా శివాజీ మహరాజ్ దివస్

సత్తెనపల్లి: ఛత్రపతి శివాజీ మహరాజ్ దివస్ ఊరేగింపు పట్టణంలో ఆదివారం వైభవంగా సాగింది.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ శివాజీ మహరాజ్ దక్షిణ దివస్ యాత్ర సందర్భంగా విజయవాడ దుర్గమ్మ దేవస్థానం నుంచి మంగళగిరి, గుంటూరు, సత్తెనపల్లి, నరసరావుపేట, త్రిపురాంతకం, దోర్నాల నుండి శ్రీశైలం దేవస్థానం వరకు యాత్ర జరుగుతుందన్నారు. దక్షిణ దిగ్విజయ యాత్రలో భాగంగా ఈ నేలపై మరాఠా సైన్యం అడుగు పెట్టి 2025కి 348సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా శివాజీ మహరాజ్ దిగ్విజయ దివస్ అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పట్టణంలోని పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

దాసునాయన మఠంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు



నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న ఆంజనేయస్వామి ఉపాసకులు అచల దాసునాయన సద్గురు మఠంలో ఆదివారం మఠాధిపతుల ప్రవచనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మఠం పీఠాధిపతి కటారు దాసునాయన అధ్యక్షత వహించగా, నరసరావుపేట అఖిలపీఠం పీఠాధిపతి చిమటా వెంకటరావు శిష్యుడు పుల్లారావు, ఫిరోజ్ పీఠం అధిపతి పోకల వెంకటరావు, గుంటూరు బ్రహ్మంగారి పీఠం అధిపతి సుగుణ ప్రవచనాలు వినిపించారు. భగవద్గీత అంతరార్థం, వేదాంత పరిచయం, వేద విజ్ఞానం, ఆత్మజ్ఞానాన్ని పొంది జీవన్ముక్తులగుట అనే అంశాలపై ప్రసంగించారు. అన్నదానం చేశారు. కార్యక్రమాలను నూతలపాటి హనుమాయమ్మ, కటారు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.